నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I హైదరాబాద్, శనివారం 9 నవంబర్ 2024 SIDDIPET

# గోదావరి నీళ్లు తెచ్చా.. అభివృద్ధి చేశా



సిద్దిపేటలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- సిద్దిపేటలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

సిద్దిపేట, నవంబర్ 8 : సిద్దిపేట ప్రాంతానికి గోదావరి జలాలు తెచ్చానని, ఈ ప్రాంతాన్ని తన శక్తిమేర అభివృద్ధి చేశానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటి వరకు సిద్దిపేటలో 10 వేల కుటుంబాలకు 35 కోట్ల రూపాయల సీఎంఆర్‌ఎఫ్ సాయం అందించినట్లు తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలని సొంత డబ్బులతో విద్యార్థులకు టిఫిన్ పెట్టించి స్టడీ మెటీరియల్ అందించి రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపినట్లు గుర్తుచేశారు. ఎల్‌వీ ప్రసాద్ దవాఖాన ఏర్పాటు చేసి ఎంతోమంది పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించినట్లు తెలిపారు. ఎగ్జిబిషన్ సొసైటీ ద్వారా బీఫార్మసీ కాలేజీని సిద్దిపేటలో ఏర్పాటు చేయించి ఇక్కడ విద్యార్థులకు బీఫార్మసీ విద్యను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. సత్యసాయిబాబా ట్రస్ట్ ద్వారా చిన్న పిల్లలకు గుండె శస్త్ర చికిత్సలు చేసే దవాఖాన ఏర్పాటు చేసుకున్నామన్నారు. సిద్దిపేటకు గోదావరి జలాలను, రైల్వే లైన్ తీసుకువచ్చి దశాబ్దాల కలను నెరవేర్చినట్లు హరీశ్‌రావు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను సిద్దిపేటకు తెచ్చి వానకాలంలో లక్ష ఎకరాలకు, యాసంగిలో లక్ష ఎరాలకు సాగునీటిని అందించామన్నారు.పామాయిల్ ఫ్యాక్టరీని నర్మెటలో ఏర్పాటు చేయించి సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నాడని ఎద్దేవా చేశారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేదా? తెలంగాణ రాకపోతే నువ్వు ముఖ్యమంత్రివి అయ్యేవాడివా? అని రేవంత్‌ను ప్రశ్నించారు. ఇప్పుడు పంట చేతికి వచ్చినా రైతుబంధు రాలేదన్నారు. కేసీఆర్ బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండుగలకు బట్టలు పంపిణీ చేసేవారన్నారు. రెండు చీరలు ఇస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఒక్క చీర కూడా ఇవ్వలేదని విమర్శించారు. అవ్వతాతలకు రూ.4 వేల పింఛన్ ఇస్తానని చెప్పి, ఉన్న రూ.2 వేల పెన్షన్ కూడా రెండు నెలలు ఎగ్గొట్టాడన్నారు. ఏప్రిల్‌లో, ఆగస్టులో రెండు నెలల పింఛన్‌ను కాంగ్రెస్ సర్కారు ఎగ్గొట్టిందన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోలు జరిగేదని, రెండు రోజులకే రైతుల అకౌంట్లో డబ్బులు పడేవన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేసినందుకు మోసం చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి బెదిరింపులకు బీఆర్‌ఎస్ భయపడదని, హామీలను అమలు చేసేవరకు పోరాడుతుందని హరీశ్‌రావు అన్నారు. ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

# హైనా దాడిలో 40 గొర్రెలు మృతి



మాచాపూర్‌లో బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి

చిన్నకోడూరు, నవంబర్ 8 : సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామానికి చెందిన మీసం మల్లయ్య తన వ్యవసాయ పొలం వద్ద పశువుల పాకలో గురువారం గొర్రెల మందను తొలి ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఉదయం గొర్రెల మంద దగ్గరికి వెళ్లి చూడగా 42 గొర్రెలు హైనా దాడిలో మృత్యువాత పడ్డాయి. దీంతో రూ.2 లక్షల మీరు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు మీసం మల్లయ్య వాపోయాడు. చిన్నకోడూరు మాజీ ఎంపీపీ కూర మాణిక్య రెడ్డి సంఘటనా స్థలం వద్దకు చేరుకుని బాధితుడిని పరామర్శించారు. బాధితుడికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అదేలా కృషిచేస్తామన్నారు. ఆయన వెంట ఫారెస్ట్ అధికారులు బుచ్చయ్య, శ్రీకాంత్, మాజీ సర్పంచ్ గాజుల బాబు, బీఆర్‌ఎస్ నాయకులు ఎలేటి రాజారెడ్డి, సుంచు ఎల్లయ్య, ఉప సర్పంచ్ పున్నం సురేశ్, గుర్రాల రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహం చూపిన గ్రాడ్యుయేట్లు, టీచర్లు

- ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు భారీ స్పందన
- 3,58,452 మంది పట్టభద్రులు, 27,879 మంది ఉపాధ్యాయుల నమోదు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 74,293 మంది పట్టభద్రులు, 8,174 ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు
- డిసెంబర్ 30న ఫైనల్ ఓటరు జాబితా
- అభ్యర్థుల ఖరారు చేసే పనిలో ప్రధాన పార్టీలు
- ప్రచారంపై దృష్టిసారించనున్న అభ్యర్థులు



సిద్దిపేట, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు భారీగానే ఓటర్లు నమోదయ్యారు. పట్టభద్రులు ఎమ్మెల్సీ స్థానానికి 3,58,452 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 27,879 మంది ఓటరుగా నమోదు చేసుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో సిద్దిపేట నుంచి పట్టభద్రులు 32,133 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 3,612 మంది నమోదు చేసుకున్నారు. మెదక్ జిల్లాలో 13,885 మంది పట్టభద్రులు,1,443 మంది ఉపాధ్యాయులు, సంగారెడ్డి జిల్లాలో 28,275 మంది పట్టభద్రులు, 3,119 మంది ఉపాధ్యాయులు తమ ఓటును ఈనెల 6 వరకు నమోదు చేసుకున్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రస్తుతం 15 జిల్లాలు ఉన్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఆన్‌లైన్ విధానంలో ఓటరుగా నమో దు చేసుకున్నారు.డిగ్రీ ఉత్తీర్ణులైన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి,స్కూల్ అసిస్టెంట్లు, జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ లెక్చరర్లు, యూడైస్‌లో నమోదైన ప్రైవేట్ పాఠశాలల్లోని టీచర్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఓటరుగా నమోదు చేసుకున్నారు. పట్టభద్రుల స్థానం నుంచి ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా రఘోత్తమ్ రెడ్డి కొనసాగుతున్నారు. వచ్చే ఏడాది మార్చి 29న వీరి పదవీ కాలం ముగియనున్నది.

**ఉత్సాహంగా నమోదు...**

డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. 2019 ఎన్నికల ప్రకారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 23,214 మంది ఓటర్లు ఉండగా, పట్టభద్రుల ఎమ్మె ల్సీ స్థానానికి 1,96,321 మంది ఓటర్లు ఉన్నారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మె ల్సీ స్థానాలకు ఓటరు నమోదు ఈసారి భారీగా ఆసక్తి చూపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి పట్టభద్రులు తమ ఓటుహక్కును నమోదు చేసుకున్నారు. ఈనెల 6 వరకు నమోదైన వివరాలు చూస్తే పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 3,58,452 మంది ఓటరుగా నమోదు చేసుకున్నారు. గత ఎన్నికల కంటే ఈసారి 1,62, 131మంది పట్టభద్రుల ఓటర్లు నమోదయ్యాయి. ఈసారి పట్టభద్రులు తమ ఓటు ను నమోదు చేసుకోవడానికి పోటీపడ్డారు. మరింత సమయం ఉంటే ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 27,879 మంది ఓటరుగా నమోదయ్యారు. గత ఎన్నికల్లో 23,214 మంది ఉండగా, ఈసారి 27,879 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈసారి 4,665 మంది ఎక్కువ నమోదయ్యారు. ఈనెల 30న తుది ఓటరు జాబితా రానున్నది. దీంతో పూర్తి ఓటరు లెక్క తేలనున్నది.

**ప్రచారంపై దృష్టి సారించిన పార్టీలు**

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు పోటీచేస్తున్న అభ్యర్థులు ప్రచారంపై దృష్టిసారించారు. 2019 ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 17 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. ఈసారి ఆ సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థులను ఖరారు చేసే పనిలో ప్రధాన పార్టీలు నిమగ్నమయ్యాయి. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీతో పాటు ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు రంగంలో ఉండనున్నారు. ఎమ్మెల్సీ స్థానం 15 కొత్త జిల్లాల పరిధికి విస్తరించి ఉంది. దీంతో ఎక్కువ మంది అభ్యర్థులు రంగంలో ఉండే అవకాశాలు ఉన్నాయి. ఈ ఎమ్మెల్సీ స్థానాం పరిధిలో 271 మండలాలు, 43 శాసనసభ నియోజకవర్గాలు విస్తరించి ఉన్నా యి. ఇక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పలువురు పోటీ చేయడానికి ఉత్సాహం చూపుతున్నారు. ఇప్పటికే పీఆర్‌టీయూ తమ అభ్యర్థిగా వంగ మహేందర్ రెడ్డిని ప్రకటించింది. ఆయన తన ప్రచారాన్ని ప్రారంభించారు. అన్ని జిల్లాలను తిరుగుతూ ఉపాధ్యాయులను కలుస్తూ తనను గెలిపించాలని కోరుతున్నారు.

**ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈనెల 6వరకు నమోదైన ఓటర్ల వివరాలు**

| క్ర. జిల్లా | పట్టభద్రులు | ఉపాధ్యాయ |
|---|---|---|
| 1. సిద్దిపేట | 32,133 | 3,612 |
| 2. మెదక్ | 13,885 | 1,443 |
| 3. సంగారెడ్డి | 28,275 | 3,119 |
| మొత్తం | 74,293 | 8,174 |

**2019 ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా ప్రకారం (పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మొత్తం ఓట్లు )**

| విభాగం | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| ఉపాధ్యాయ | 15,892 | 7,322 | - | 23,214 |
| పట్టభద్రులు | 1,35,218 | 61,077 | 26 | 1,96,321 |

# నేడు కొల్చారంలో బీఆర్‌ఎస్ రైతు మహాధర్నా



కొల్చారంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- హాజరు కానున్న మాజీ మంత్రి హరీశ్‌రావు
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

కొల్చారం, నవంబర్ 8: ప్రభుత్వం రైతులను వంచిస్తూ ధాన్యం తూకంలో నిర్లక్ష్యం చేస్తున్నందుకు నిరసనగా శనివారం కొల్చారంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ రైతులతో భారీ ధర్నా చేపట్టబోతున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కొల్చారంలో స్థానిక నాయకులతో కలిసి కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులతో కలిసి చేపట్టే ధర్నాలో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, శేరి సుభాష్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెంకట్రామి రెడ్డి, అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, జహీరాబాద్ మాజీ ఎమ్మెల్యే మాణిక్యరెడ్డి, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు.ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గౌరీశంకర్ గుప్తా, యువత అధ్యక్షుడు కోణాపురం సంతోష్ రావు, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకులు ముత్యంగారి సంతోష్ కుమార్, రవితేజ రెడ్డి, కరెంటు రాజాగౌడ్, నింగోల్ల చెన్నయ్య, ఎండుగుల కృష్ణ, పాంద్ర వెంకటేశం, ఆశన్నగారి, కిష్టయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# వివాదాస్పదంగా సిద్దిపేట ఏసీపీ తీరు



సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సీఎం బర్త్‌డే వేడుకల్లో సిద్దిపేట ఏసీపీ మధు

సిద్దిపేట, నవంబర్ 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సిద్దిపేట ఏసీపీ మధు తన విద్యుక్త ధర్మాన్ని విస్మరిస్తున్నారు. తను ఒక పోలీస్ అధికారిని అనే విషయాన్ని మరిచి కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సీఎం బర్త్‌డే వేడుకల్లో ఆయన పాల్గొనడం వివాదాస్పదంగా మారింది. శుక్రవారం సిద్దిపేట జిల్లాకేంద్రంలో సీఎం రేవంత్ బర్త్ డే వేడుకలను కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, నాయకులు పూజల హరికృష్ణ తదితరులు కలిసి కేక్ కటింగ్ చేయగా, సిద్దిపేట ఏసీపీ మధు పాల్గొన్నారు. ఈయన పోలీస్ అధికారా..? లేక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తనా అని విమర్శలు వ్యక్తమయ్యాయి. సిద్దిపేట ఏసీపీగా మధు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆయన తీరు వివాదాస్పదంగానే ఉంది. ఇటీవల నంగునూరు మండలంలో నర్మెటలో జరిగిన ఓ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ శ్రేణులపై ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గొడవకు దారితీసింది. ఎలాంటి పదవులు లేకున్నా కాంగ్రెస్ నాయకులకు ఆయన ఎస్కార్ట్‌ను కల్పిస్తూ అధికార పార్టీపై తన అభిమానాన్ని ఏసీపీ చాటుకుంటున్నారు. ప్రైవేట్ సంభాషణల్లో సైతం బీఆర్‌ఎస్‌పై ఆయన తన అక్కసును, నోటి దూలను వెల్లగక్కుతున్నట్లు విమర్శలు ఉన్నాయి.

# కేసీఆర్ పాలనలో ఆధ్యాత్మిక శోభ

## శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి



ఆకునూరులో శాసన మండలి ప్రతిపక్ష నేతకు స్వాగతం పలుకుతున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, ఏకానందం

చేర్యాల, నవంబర్ 8 : కేసీఆర్ పాలనలో తెలంగాణకు ఆధ్యాత్మిక శోభ వచ్చిందని, ఇప్పుడు రాష్ట్రంలో అలాంటి పరిస్థితి లేదని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరులో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర స్వామి, శ్రీ మహమ్మాయి అమ్మ వారి ఆలయాల నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సందర్భం గా మాట్లాడుతూ.. కేసీఆర్ తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. అన్నివర్గాల ప్రజలకు మేలు చేశారన్నారు. కేసీఆర్ హయాంలో పల్లెలు పచ్చగా ఉన్నాయన్నారు. గ్రామాల్లో బీఆర్‌ఎస్ పాలనలో దేవాలయాలు నిర్మాణానికి నోచుకున్నాయని, ప్రజలు సంతోషంగా గ్రామ దేవతలకు పండుగలు చేసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదన్నారు. రైతులు పండించిన ధాన్యం కొంటలేరని, రైతుభరోసా ఇవ్వడం లేదన్నారు. సీఎం, మంత్రులు సోయిలేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు కావడం లేదన్నారు. కాంగ్రెస్ సర్కారు డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రజలు, మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు గమనిస్తున్నారని, వారి చేతిలో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదన్నారు. పోలీస్‌శాఖపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఉల్లెంగల పద్మ, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఉల్లెంగల సేవా ట్రస్ట్ చైర్మన్ ఉల్లెంగల ఏకానందం, ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, మాజీ ఎంపీటీసీ టీ.వేణుగోపాల్, బీఆర్‌ఎస్ నాయకుడు చీపురు మల్లేశం,విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షుడు ఉల్లెంగల వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు టీవీ నారాయణ, తాటికొండ రాములు, తాటికొండ చక్రధర్, తాటికొండ ప్రవీణ్, సుభాష్, సుదర్శనం,పోలోజు బాలరాజు, పోలోజు కృష్ణమూర్తి, ఉల్లెంగల దేవదాసు,వెకంట్రాది, పోలోజు సుధాకర్, మహేందర్, ఉల్లెంగల కవిత, అనంతోజు బాలరత్నం, తాటికొండ యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

## రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ దేవేందర్‌సింగ్ చౌహాన్



కొనుగోళ్లు వేగంగా జరగక పోవడంతో డీఎంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సివిల్ సప్లై రాష్ట్ర కమిషనర్ దేవేందర్‌సింగ్ చౌహాన్

రామాయంపేట, నవంబర్ 8 : రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరిస్తామని సివిల్ సప్లై రాష్ట్ర కమిషనర్ దేవేందర్‌సింగ్ చౌహాన్ అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా రామాయంపేటలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ ఉన్న రైతులు తమ బాధలను కమిషనర్ దృష్టికి తెచ్చారు. తాము 25 రోజులుగా ధాన్యం విక్రయానికి తెచ్చాయని, అధికారులు కాంటా వేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా తూకం పెడితే కేవలం ఒకే ఒక్క లారీని రైస్‌మిల్‌కు పంపించారని తెలిపారు.అక్కడే ఉన్న డీఎంను కమిషనర్ పిలిచి చీవాట్లు పెట్టారు. డీఎంకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశాలను జారీచేశారు.మూడు రోజుల నుండి రైతులను ఇబ్బందులు పెడుతూ ఎందుకు ధాన్యం లోడింగ్ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొంటామని కమిషనర్ రైతులకు భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, మెదక్ జిల్లాలో 3500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నట్లు తెలిపారు. రామాయంపేటకు 300 టార్పాలిన్లు పంపినట్లు కమిషనర్ తెలిపారు. కొన్న ధాన్యం వెంటవెంటనే లారీల ద్వారా గోడౌన్లకు తరలిస్తామన్నారు. అనంతరం వేర్వేరుగా రైస్‌మిల్లర్లు, జిల్లా అధికారులతో రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ దేవేందర్‌సింగ్ చౌహాన్ సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. రైతుల సంక్షేమానికి పనిచేయాలని ఆదేశించారు. సమీక్షలో కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేశ్, జిల్లా వ్యవసాయాధికారి గోవింద్, డీఎస్‌వో సురేశ్‌రెడ్డి, డీఎం హరికృష్ణ, తూనికలు కొలతలశాఖ జిల్లా అధికారి సుధాకర్, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు చంద్రపాల్, రారైస్ మిల్లుల అధ్యక్షుడు వీరేశం, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ డీఎం. యాదయ్య, రామాయంపేట తహసీల్దార్ రజినీకుమారి, ఏవో రాజ్‌నారాయణ, ఆర్ఐ గౌస్, సీఈవో నర్సింహులు ఉన్నారు.

# చేర్యాల సమగ్రాభివృద్ధే ధ్యేయం

## జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సిద్దిపేట జిల్లా చేర్యాలలో కార్ వాష్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, నవంబర్ 8 : చేర్యాలను అన్నివిధాలుగా అభివృద్ధి చేయడమే ధ్యేయమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు సాయి ఏర్పాటు చేసుకున్న ఎస్‌ఆర్ కార్ వాషింగ్ సెంటర్‌ను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి,మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్‌తో కలిసి ఎమ్మెల్యే పల్లా ప్రారంభించారు.ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. చేర్యాలలో కోర్టు ఏర్పాటు ప్రక్రియ బీఆర్‌ఎస్ హయాంలో ప్రారంభమైందన్నారు. తాను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో సైతం చేర్యాల కోర్టు ఏర్పాటు కోసం లేఖను సంబంధిత అధికారులకు అందజేసినట్లు గుర్తుచేశారు. కోర్టు ఏర్పాటు కోసం ఎంపీడీవో భవనాన్ని కేటాయించామని, అనంతరం రూ.20 లక్షల విలువైన ఫర్నిచర్ సరఫరా చేసినట్లు తెలిపారు. కోర్టు భవన ఏర్పాటు పనులు ఆలస్యం అవుతున్నాయని తన దృష్టికి రావడంతో కాంట్రాక్టర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తన విజ్ఞప్తితో ప్రభుత్వం చేర్యాల కోర్టుకు 27 మంది సిబ్బందిని కేటాయించిందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, టౌన్ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు,ధూళిమిట్ట అధ్యక్షుడు మంద యాదగిరి,యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జింకల పర్వతాలుయాదవ్, గదరాజు చందు, బీరెడ్డి ఇన్నారెడ్డి, ఉట్కూరి అమర్ గౌడ్, మంచాల కొండయ్య, టౌన్ సెక్రటరీ బూరగోని తిరుపతిగౌడ్, తాడెం రంజితాకృష్ణమూర్తి, పచ్చిమడ్ల మానస, యాట భిక్షపతి పాల్గొన్నారు.

**టీచర్ కుటుంబానికి పరామర్శ..**

మండలంలోని వేచరేణి గ్రామానికి చెందిన ప్రభుత్వ టీచర్ పర్వాటక ధర్మారెడ్డి రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంతో మృతి చెందడంతో శుక్రవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. తాము అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. యేనుగుల దుర్గయ్య, పర్వాటకం దుర్గారెడ్డి, వకులభరణం నర్సయ్య పంతులు, గదరాజు యాదగిరి, బండమీది కరుణాకర్, అరిగె కనకయ్య, బొంగు రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

# సమగ్ర సర్వే పక్కాగా చేయాలి

## ప్రత్యేకాధికారి హరిచందన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి హరిచందన, సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, నవంబర్ 8: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పక్కాగా చేయాలని, పూర్తి వివరాలను నమోదు చేయాలని, ఎన్యూమరేటర్లకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేశాలని మెదక్ ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి దాసరి హరిచందన అధికారులకు సూచించారు. ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణపై శుక్రవారం సిద్దిసేట కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాచార సేకరణలో ఎలాంటి కాంప్రమైజ్ కావద్దన్నారు. ప్రజలను కన్విన్స్ చేసి సంపూర్ణ సమాచారం రాబట్టాలన్నారు. ఎలాంటి సందేహా లు ఉన్న మాస్టర్ ట్రైనర్లు జిల్లా అధికారులను తెలుసుకొని ప్రజ లకు వివరించాలన్నారు. ప్రత్యేక అధికారులు ఈ కార్యక్రమాన్ని సీరియస్ గా మానిటరింగ్ చేయాలని, సేకరించిన డాటాను జాగ్రత్తగా ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ.. జిల్లాలో 3.45 లక్షల కుటుంబాలు ఉన్నాయని, ఈ సర్వేలో 2032 మంది ఎన్యూమరేటర్లు,240 మంది సూపర్‌వైజర్లను నియమించా మ న్నారు. ఇంటింటికీ స్టిక్కరింగ్ దాదాపు పూర్తి కావచ్చిందని తెలిపారు. సమీక్షంలో అదనపు కలెక్టర్, నోడల్ అధికారి అబ్దుల్ హమీద్, సిద్దిపేట,హుస్నాబాద్,గజ్వేల్ ఆర్డీవోలు సదానందం, రామ్మూర్తి, చంద్రకళ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### సిద్దిపేట సీపీని కలిసిన కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్, నవంబర్ 8: కమ్యూనికేషన్ నూతన ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రావు శుక్రవారం సిద్దిపేట సీపీ డాక్టర్ అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. కమ్యూనికేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆయనకు సీపీ సూచించారు.

# రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం





సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత తదితరులు

హుస్నాబాద్, నవంబర్ 8: హుస్నాబాద్ పట్టణంలోని మినీ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. అండర్-14వి భాగంలో జరుగనున్న ఈ పోటీలు మూడు రోజులు జరుగుతాయి. పది ఉమ్మడి జిల్లాల నుంచి బాలుర జట్లు 10, బాలికల జట్లు 10 పోటీల్లో తలపడనున్నాయి. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను తెలంగాణ తరపున హ్యాండ్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. హుస్నాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీలను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రజితావెంకట్, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మినీస్టేడియాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హుస్నాబాద్‌లో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ఏర్పాటు చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, పీడీ, పీఈటీలు రావుల శ్రీనివాస్, వెంకటనర్సయ్య, సత్యనారాయణరెడ్డి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన కోచ్‌లు, రెఫరీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.